
చీమకుర్తిలో బూచేపల్లి సుబ్బారెడ్డి, కమలాకర్‌రెడ్డి స్మారకాల వద్ద నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి


చీమకుర్తి హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు


మద్దిపాడులో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

సందడే సందడి..!

- కోలాహలంగా సంక్రాంతి సంబరాలు
- ముగ్గులు, ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు
- చీమకుర్తిలో బూచేపల్లి సుబ్బారెడ్డి, కమలాకర్‌రెడ్డిలకు కుటుంబ సభ్యుల నివాళులు

చీమకుర్తి:

సంక్రాంతి సంబరాలతో సంతనూతలపాడు నియోజకవర్గంలో సందడి వాతావరణం నెలకొంది. పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీల్లో స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్ది సత్తాచాటారు. చీమకుర్తిలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా చీమకుర్తిలోని బూచేపల్లి పార్కులో దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి, సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి స్మారకాల వద్ద పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. బూచేపల్లి నందిని, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి గోదాదేవి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు.

సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు పోటీలు...

చీమకుర్తి రూరల్: చీమకుర్తి మండలంలోని నిప్పట్లపాడులో సీఐటీయూ, డీవైఎఫ్ఐ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికెట్, రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆటలాడుతూ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ క్రీడలు ఆత్మస్థైర్యం నింపటానికి, ఐక్యతకు దోహదం చేస్తాయంటూ నిర్వాహకులను అభినందించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు నుగ్గ శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘ మండల అధ్యక్షుడు శీలం ఆదినారాయణ, సీఐటీయూ నాయకులు మువ్వా లక్ష్మయ్య, ఎం.ప్రసాదు, రిటైర్డ్ టీచర్ మువ్వా మాలకొండలరాయుడు, యువజన సంఘ నాయకులు ఎస్.ప్రేమ్‌కుమార్, రాము, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


ఉప్పుగుండూరులో ఎడ్ల పోటీలు..


ఉప్పుగుండూరులో తాడులాగుడు పోటీల్లో తలపడుతున్న యువత

దేవరపాలెంలో ముగ్గుల పోటీలు...

చీమకుర్తి మండలంలోని దేవరపాలెం గ్రామంలో బూచేపల్లి కోటిరెడ్డి సుబ్బమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెన్నపూస రత్తమ్మ శేఖర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బూచేపల్లి నాగిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గంగిరెడ్డి నాగిరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ నూనె శివనాగేశ్వరరావు, వి.వెంకటేశ్వర్లు, లక్కు కోటిరెడ్డి, పులి వెంకటరెడ్డి, జి.వెంకటరెడ్డి, ఆర్.నాగేశ్వరరావు, ఎస్.నరసింహారెడ్డి, తిరుపతిరావు పాల్గొన్నారు.

మద్దిపాడులో ముగ్గుల పోటీలు...

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడులోని బీసీ కాలనీలో సంక్రాంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆకర్షణీయమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో యువత పెద్ద ఎత్తున క్రీడా పోటీలు, సాంస్కృతికి కార్యక్రమాలు నిర్వహించి భారీగా పాల్గొన్నారు. ఉప్పుగుండూరు గ్రామంలో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి క్రీడల్లో భాగంగా మంగళవారం ట్రాక్టర్ రివర్స్, తాడు లాగే పోటీలు నిర్వహించారు. ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో మొదటి బహుమతిని బండారుపల్లి శ్రీనివాసరావు గెలుపొందారు. తాడులాగే పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. బుధవారం నిర్వహించిన పోలురాధ నాటుబండి లాగుడు పోటీల్లో మొత్తం 20 జతల ఎడ్లు పాల్గొన్నాయి. మాచవరం గ్రామానికి చెందిన గాజుల కోటయ్య ఎడ్ల జత నిర్ణీత 10 నిమిషాల కాలంలో 2270 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో బెల్లం సుబ్బారావు ఎడ్ల జత 2190 అడుగులతో, గోగినేని సుబ్బారావు ఎడ్ల జత 2090 అడుగులతో మూడో స్థానంలో నిలిచాయి. పోటీలను చూడటానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో...

ఒంగోలు టౌన్: నగరంలోని మున్సిపల్ వర్కర్స్ కాలనీలో ఉత్సాహభరిత వాతావరణంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. బుధవారం కాలనీలో ఐక్యత కోసం ఆటలు-యువత మైత్రికి బాటలు పేరుతో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ దళిత కాలనీలో ఏళ్ల తరబడి మౌలిక వసతులు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ కాలనీలో నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ నాయకులు బి.రామయ్య, యాకోబు, సుధీర్, రవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఉప్పుగుండూరులో ట్రాక్టర్ రివర్స్ పోటీలు..


నిప్పట్లపాడులో విజేతలకు బహుమతులు అందిస్తున్న సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు


ఒంగోలు మున్సిపల్ వర్కర్స్ కాలనీలో మహిళలకు బహుమతులు అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

వైభవంగా పారువేట మహోత్సవం






ఒంగోలు : గద్దలగుంట పారువేటలో నగరంలోని దేవాలయాల ఉత్సవమూర్తులు

- పలు ఆలయాల ఉత్సవమూర్తులకు నగరోత్సవం
- తెప్పోత్సవంలో ప్రసన్నచెన్నకేశవస్వామి
- అయ్యప్పస్వామి క్షేత్రాలలో మకర జ్యోతి దర్శనం
- పారువేటలో, దేవాలయాల్లో కిక్కిరిసిన భక్తులు

ఒంగోలు మెట్రో: కనుమ సంబరాలు అంబరాన్నంటాయి. ఒంగోలు నగరంలోని గద్దలగుంటలో బుధవారం రాత్రి పారువేట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నగరంలోని 32 దేవాలయాల నుంచి ఉత్సవమూర్తులను స్థానిక కేశవస్వామిపేటలోని చెన్నకేశవస్వామి దేవస్థానం నుంచి గద్దలగుంటలోని అంకాలమ్మ రామాలయం దేవాలయాల వరకు పురవీధుల్లో ఊరేగింపుగా తరలించారు. వివిధ దేవీ దేవతల ఉత్సవమూర్తులను ఘనంగా పుష్పాలతో అలంకరించి ప్రత్యేక రథంపై ఊరేగిస్తూ పారువేట మహోత్సవంలో భక్తులకు దర్శనం కల్పించారు. సంక్రాంతి, కనుమ సందర్భంగా నగరంలోని వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవస్థానాల నిర్వాహకులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేశారు. మంచినీరు, ప్రసాదాలు అందజేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు భక్తులను స్వాగతిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర ప్రసన్న చెన్నకేశవస్వామి తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు, రాజ్యలక్ష్మి అమ్మవారు, ప్రసన్నచెన్నకేశవస్వామి తెప్పోత్సవంలో తిరుగుతూ భక్తులకు కనువిందు చేశారు.


కేవీ అగ్రహారంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరునాళ్లలో కోలాటంలో పాల్గొన్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ



ఒంగోలు : గద్దలగుంట పారువేటలో అంకమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

అయ్యప్పస్వామికి మకర సంక్రాంతి వేడుకలు...

మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా ఒంగోలు నగరంలోని అయ్యప్పస్వామి క్షేత్రాలలో హరిహరసుత అయ్యప్పస్వామి జ్యోతి దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఒంగోలు మంగమూరు రోడ్డులోని అయ్యప్పస్వామి క్షేత్రంలో, కొత్తపట్నం బస్టాండ్‌లోని అయ్యప్పస్వామి దేవస్థానంలో, గొడుగుపాలెంలోని అయ్యప్ప దేవాలయంలో, పేర్నమిట్ట, త్రోవగుంట, కొప్పోలు అయ్యప్పస్వామి ఆలయాల్లో కర్పూర జ్యోతి కార్యక్రమాలను కనుల విందుగా నిర్వహించారు.

కోలాటంలో పాల్గొన్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ...

చీమకుర్తి రూరల్: మండలంలో కాండూరివారి అగ్రహారం గ్రామంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. సర్పంచ్ వెంకటలక్ష్మి రామారావు, ఎంపీటీసీ యన్నం విజయలక్ష్మి శేషురెడ్డి, గౌరడోయిన ఏడుకొండలు, యానం నాగరాజు, టి.నాగరాజు, పి.గోపి, టి.రాజేష్, టి.లక్ష్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేవీ అగ్రహారంలో శ్రీవారి రథోత్సవం...

చీమకుర్తి మండలంలోని కేవీ అగ్రహారం గ్రామంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా శ్రీవారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శిద్దా హనుమంతరావు, భరత్, కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.


ఒంగోలు : శ్రీగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కోలాటం..

ఉప్పుగుండూరులో ఘనంగా శ్రీవేణుగోపాలస్వామి తెప్పోత్సవం...

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు ఊరచెరువులో శ్రీవేణుగోపాలస్వామి తెప్పోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తుల దర్శనార్థం చెరువు కట్టపై స్వామివారిని ఉంచారు. విద్యుత్ కాంతులతో గ్రామోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవాన్ని ఉప్పుగుండూరుతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు. రోజ్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపాల్ టి.శామ్యూల్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటరులో చిన్నారులతో కోలాటంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించగా ఆకట్టుకున్నాయి.


ఒంగోలు : గద్దలగుంట పారువేటలో పాల్గొన్న ప్రజలు


ఒంగోలు : గద్దలగుంటలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దర్శనానికి క్యూ కట్టిన భక్తులు


ఒంగోలు : కొత్తపట్నం బస్టాండ్ వద్ద అయ్యప్పస్వామి ఆలయం దగ్గర మకర జ్యోతి దర్శనంలో పాల్గొన్న భక్తులు


ఒంగోలు : గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

వైవీ సుబ్బారెడ్డిని సత్కరించిన దుంపా దంపతులు


వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న దుంపా చెంచిరెడ్డి, రమణమ్మ దంపతులు, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల నాయకులు

సంతనూతలపాడు: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డిని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను చెంచిరెడ్డి దంపతులు కలిసి సత్కరించారు. ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబుని సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిండికేట్ రైతు సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యల్లమందరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ రంతుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు కుంచాల నాగాంజనేయులు, వల్లపు శీను, మస్తాన్‌వలి, కరుకు సుబ్బారావు, షేక్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం


తగలబడుతున్న బ్యారన్

మద్దిపాడు: మండలంలోని తెల్లబాడు గ్రామంలో బుధవారం ఉదయం పొగాకు బ్యారన్ దగ్ధమై రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెల్లబాడు గ్రామానికి చెందిన కాట్రగడ్డ వెంకట శేషమ్మ బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పొగ గట్టంపైపుపై ఆకులు జారిపడి మంటలు వ్యాపించడంతో బ్యారన్ పూర్తిగా కాలిపోయింది. పక్క బ్యారన్‌కు మంటలు అంటుకోకుండా స్థానికులు నీరు చల్లి అదుపు చేశారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

పండుగకు పస్తులుంచిన కూటమి సర్కార్


ఆటల పోటీల సభలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: నిరుపేద, సామాన్య ప్రజలు సంతోషంగా సంక్రాంతి పండుగ చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం కనీసం నిత్యావసర వస్తువులు కూడా సబ్సిడీపై సరఫరా చేయలేదని ప్రకాశం బాలోత్సవ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.రామరాజు విమర్శించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని దిబ్బలరోడ్డులో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ గత ఏడు నెలల్లో నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచారని, కూటమి పాలనలో ప్రజలు పండుగ రోజైనా కడుపునిండా తిండి తినే పరిస్థితి లేకుండా పోయిందని మండిపడ్డారు. ప్రజలకు ఇవ్వాల్సిన రాయితీలు ఇవ్వలేదని, కనీసం ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయకుండా కూటమి పాలకులు మాత్రం పండుగలు చేసుకుంటూ సంబరాలలో మునిగితేలుతున్నారని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఏడు నెలలకే విపరీతంగా చార్జీలు పెంచి ప్రజలపై మోపలేని భారం వేయడం దారుణమన్నారు. ప్రభుత్వ వైఖరిని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు ప్రజలను విడగొడుతుంటే బాలోత్సవ్ ఐక్యత కోసం ఆటలు-యువజన మైత్రికి బాటలు పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రజా సంఘాలు ఆటల పోటీలే కాకుండా ప్రజా సమస్యలపై కూడా పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. ఫిబ్రవరిలో జిల్లా కేంద్రమైన ఒంగోలులో బాలోత్సవం నిర్వహించనున్నారని, పిల్లలు, పెద్దలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమానికి ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, జి.కళ్యాణి, నాగమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.